ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.1 ; కనిష్ఠం 24.8



నిజామాబాద్

జిల్లా వార్తలు

సోమవారం 5 ఆగస్టు 2024





ఎస్సారెస్పీ ఆయకట్టుకు

నీటి విడుదల ఖరారు

- ఈనెల 7 నుంచి కాకతీయ, లక్ష్మీ సరస్వతీ కాలువల ఆయకట్టుకు నీటి విడుదల
- ఆన్ ఆఫ్ పద్ధతిలో ఆయకట్టుకు నీటిని అందించేందుకు అధికారుల ఏర్పాట్లు
- గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద కూడా నీటివిడుదల
- ప్రాజెక్టు పరిధిలో 9.5లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్ణయం
- వరద పెరిగితే ఎల్ఎండీ ఆయకట్టుకు నీటి మళ్లింపునకు అవకాశం

నిజామాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు నీటి విడుదల ఖరారు చేశారు. ప్రాజెక్టు పరిధిలోని కాకతీయ, సరస్వతీ, లక్ష్మీ కాలువలతో పాటు గుత్ప అలిసాగర్ ఎత్తిపోతల పథకాల ఆయకట్టుకు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయించారు. రాష్ట్రస్థాయిలో జరిగిన శివం కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో పాటు విడుదల తేదీలను ప్రకటించారు. ప్రాజెక్టు పరిధిలో ఈనెల 7 నుంచి ఆన్ ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు సగానికి పైగా నిండడం, ఎగువ ప్రాంతానికి వరద వస్తుండటంతో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఈ నీటి విడుదల చేయనున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా పరిధిలోని గోదావరి పైనున్న అన్ని ప్రాజెక్టులు నిండటం వల్ల వరద ప్రతిరోజూ వస్తుండటంతో ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. అక్టోబరు 28 వరకు బాబ్లీ గేట్లు తెరిచే ఉండటం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారు. నీటి విడుదలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుండటంతో ఎల్ఎండీ ఎగువన సుమారు 9.5 లక్షల ఎకరాలకు ఈ సీజన్‌లో సాగునీరు అందనుంది.

ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. మహారాష్ట్రలో వర్షాలు పడుతుండటం అక్కడ ఉన్న విష్ణుపురి, అందూరా, బాలేగాం ప్రాజెక్టులు నిండటంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరి ద్వారా ప్రతిరోజూ ప్రాజెక్టులోకి వరద వస్తోంది. ప్రాజెక్టుకు ప్రస్తుతం 21,422 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను 1079.7 అడుగులకు నీటిమట్టాలు చేరుకున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 44.266 టీఎంసీలకు నీళ్లు చేరాయి.

నీటి విడుదలకు శివం కమిటీ నిర్ణయం

ప్రాజెక్టులోకి సగానికి పైగా నీళ్లు రావడం ప్రతిరోజూ నీటిమట్టాలు పెరుగుతుండటంతో ఈ వానాకాలం సాగుకు నీటిని విడుదల చేసేందుకు రాష్ట్రస్థాయిలో జరిగిన శివం కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోనే అన్ని ప్రాజెక్టుల పరిధిలోని ఇరిగేషన్ అధికారులు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రాజెక్టులో 40 టీఎంసీల నీళ్లు దాటడం, ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండటంతో ప్రాజెక్టు పరిధిలోని మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. కాకతీయ కాలువ కింద ఎల్ఎండీకి ఎగువన ఉన్న ఆయకట్టుకు ఈ నీటి విడుదలను చేయనున్నారు. ఈనెల 7న కాకతీయ కాలువ ఆయకట్టుకు నీటివిడుదలను ప్రారంభిస్తారు. ప్రాజెక్టు నుంచి ప్రతిరోజూ 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. ప్రాజెక్టు నుంచి ఈ కాలువ ద్వారా ఎల్ఎండీ ఎగువ ఉన్న మొత్తం ఆయకట్టుకు ఈ నీటిని అందిస్తారు. వానాకాలంలో సాగుకు నీటిని ఆన్ ఆఫ్ పద్ధతిలో విడుదల చేస్తారు. ఎనిమిది రోజుల పాటు కాలువ పరిధిలోని సగం ఆయకట్టుకు నీటిని అందించి మరో ఏడు రోజుల పాటు మరో సగం ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తారు. ఈ కాలువతో పాటు సరస్వతి, లక్ష్మీ కాలువలకు కూడా నీటి విడుదలను కొనసాగిస్తారు. ఇవే కాకుండా ప్రాజెక్టు నుంచి గుత్ప, అలీసాగర్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాలకు కూడా నీటిని విడుదల చేయనున్నారు. ప్రాజెక్టు పరిధిలో ఎల్ఎండీ ఎగువన సుమారు 9.5లక్షల ఎకరాల వరకు సాగుకు నీటిని అందించనున్నారు. కరీంనగర్‌లోని మిడ్‌మానేరుతో పాటు ఎల్ఎండీకి నీటిని మళ్లిస్తారు. అక్కడి నుంచి కాకతీయ కాలువ చివరి ఆయకట్టు వరకు నీటిని అందించనున్నారు.

ఎల్ఎండీ ద్వారా సూర్యపేట

ప్రాజెక్టు దిగువ ఉన్న ఎల్ఎండీ ద్వారా సూర్యపేట వరకు ఉన్న ఆయకట్టుకు నీటిని అందించనున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు ఒక పంటకు సరిపోనుండటంతో సాగుకు నీటిని అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అక్టోబరు 28 వరకు బాబ్లీ గేట్లు తెరిచి ఉంచడంతో ప్రతిరోజూ అర టీఎంసీ నుంచి ఒక టీఎంసీ వరకు వరద వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం నాట్లు వేయడం పూర్తి చేస్తున్నందున సుమారు మూడు నెలలకు పైగా ఈ నీటి విడుదలను కొనసాగించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌గుప్త ప్రకటించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం మొదట కాకతీయ కాలువకు నీటి విడుదలను చేస్తామని, ఆ తర్వాతనే మిగతా కాలువలకు, ఎత్తిపోతల పథకాలకు విడుదల చేస్తామని ఆయన తెలిపారు. ప్రాజెక్టులోకి వరద వస్తుండటం వల్ల నీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ప్రాజెక్టు కింద భారీగా వర్షాలు

గత నెల నుంచి వర్షాలు పడుతుండటంతో ప్రాజెక్టు కింద భారీగా వరిసాగును చేపట్టారు. ప్రాజెక్టు పరిధిలోని నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హన్మకొండ జిల్లాల పరిధిలో ఎక్కువ మొత్తంలో వరిసాగు చేశారు. వర్షాలు పడుతుండటం ప్రాజెక్టుల్లో నీళ్లు చేరుతుండటంతో రైతులు ఎక్కువ మొత్తంలో ఈ సాగును చేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యానికి బోనస్ ప్రకటించడం వల్ల సన్నరకాల సాగును ఎక్కువ మంది రైతులు వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు ఇప్పటికే 10లక్షల ఎకరాలకు పైగా వరి సాగు చేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఆయకట్టుకు నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో రైతుల్లో మరింత భరోసా పెరిగింది. సమయం దగ్గర పడుతుండటంతో రైతులు వరినాట్లను పూర్తి చేసే పనిలో ఉన్నారు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేస్తామని ప్రకటించడంతో సాగును మరింత పెంచనున్నారు.

జిల్లా జైలు రోడ్డుకు

మోక్షమెప్పుడో?

- కిలోమీటరు మేర మట్టిరోడ్డు
- మట్టి రోడ్డు గుండానే రాకపోకలు
- చిన్నపాటి వర్షానికే గుంతల మయం
- నిధులు మంజూరైనా సాగని రోడ్డు పనులు

నిజామాబాద్ రూరల్, ఆగస్టు 4: జిల్లా కేంద్రానికి అతి సమీపంలోనే ఉన్నా.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది జిల్లా కేంద్ర కారాగారం ఉంది. జిల్లా జైలు నుంచి సెంట్రల్ జైలుగా ఇటీవలే రూపాంతరం చెందింది. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులు సైతం చేపట్టారు. అయితే ఇక్కడికి రావాలంటే మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. నగర శివారులోని సారంగపూర్-బోధన్ ప్రధాన రోడ్డు నుంచి రెండు కిలోమీటర్ల లోపల కాళేశ్వరం ప్యాకేజీ-21 నుంచి కిలోమీటరు దూరంలో ఈ సెంట్రల్ జైలు ఉంది. ఈ జైలు కెపాసిటీ 460 కాగా జైలులో 300కు పైగా ఖైదీలు శిక్ష ననుభవిస్తున్నారు. ప్రతీరోజు రిమాండ్ ఖైదీలను సైతం జైలుకు తీసుకువస్తారు. కోర్టునుంచి సారంగపూర్‌లోని జైలుకు ఖైదీలను వాహనాల ద్వారా తరలిస్తారు. ఖైదీలకు ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే అంబులెన్స్‌లో లేదా జైలు వాహనంలో తరలిస్తారు. అయితే సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు తప్పడం లేదు.

అధ్వానంగా రోడ్డు..

సెంట్రల్ జైలు నుంచి సారంగపూర్ వరకు రెండు కిలోమీటర్ల దూరం ఉంది. జైలు నుంచి బయటకు వెళ్లేందుకు కేవలం మట్టి రోడ్డు మాత్రమే ఉంది. జైలు నుంచి రెండు మార్గాల ద్వారా బయటకు వెళ్లే అవకాశం ఉంది. రెండు వైపులా కూడా మట్టి రోడ్లున్నాయి. జైలు ఎదురుగా నిజాంసాగర్ కెనాల్ ఉంది. కెనాల్ గుండానే ప్రయాణించాల్సి ఉంటుంది. రోడ్డు వెంట పిచ్చిమొక్కలతోపాటు పెద్ద పెద్ద రాళ్లు, రప్పలు ఉన్నాయి. గతంలో జైలు సూపరింటెండెంట్‌లుగా ఉన్న అధికారులు జైలు ఖైదీలతో మట్టి రోడ్డు పనులు చేయించారు. కానీ అధ్వానంగా రోడ్లను అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. రాజకీయ నాయకుల సైతం పెద్దగా దృష్టి పెట్టడం లేదు. దాంతో ఉపాధిహామీ కూలీలతో పాటు జైలులోని ఖైదీలతో మట్టి రోడ్డు నిర్మాణం చేశారు. వాహనాలు వెళ్లేందుకు వీలుగా మట్టి రోడ్డు నిర్మాణం చేశారు.

నిధులు మంజూరైనా పనులు సాగలే..

గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ అధికారులు జైలు నుంచి సారంగపూర్ రోడ్డు వరకు పనుల కోసం నిధులు మంజూరు చేశారు. రూ.50లక్షల నిధులు మంజూరు చేశారు. కానీ పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో నిధులు లాప్స్ అయ్యాయి. దాంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. జిల్లా జైలు నుంచి బయటకు వెళ్లేందుకు రోడ్డు వరకు ఉన్న కిలోమీటరు మేర చిమ్మచీకట్లు అలుముకుంటాయి. ఈ రోడ్డు గుండా రావాలంటే భయపడాల్సిందే. వీధిలైట్లు ఏర్పాటు చేయలేదు. కేవలం జైలు ప్రధాన గేటు ముందు ఉన్న పెద్ద మాస్క్ లైట్ మాత్రమే వెలుగునిస్తోంది.

రూ.50 లక్షలు మంజూరైనా పనులు చేస్తలేరు..

:అక్బర్‌నవాజుద్దీన్, సారంగపూర్‌వాసి

సారంగపూర్ నుంచి జిల్లా జైలు వరకు అధ్వానమైన రోడ్డు ఉంది. వీధిలైట్లు కూడా లేవు. రోడ్డు కోసం ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులను కలిశాం. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ స్పందించి రూ.50లక్షల నిధులు మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయింది. పనులు దక్కించుకున్న గుత్తేదారు పనులు మాత్రం చేయడం లేదు. మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్‌ను సైతం కలిశాం. సమస్యలను వివరించాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలి.

రాత్రివేళ బయటకు వెళ్లాలంటే భయం..

:రమేష్ బాబు, జైలు సిబ్బంది

జైలులో విధులు నిర్వహించే సిబ్బంది కుటుంబాలు కూడా ఇక్కడే నివాసం ఉంటాయి. క్వార్టర్స్ నుంచి రాత్రి వేళ బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది. సరియైన రోడ్డు లేదు. వీధిలైట్లు లేక చిమ్మ చీకటిగా ఉంటోంది. అధికారులు స్పందించి రోడ్డును వేయాలి.



• జైలుకు వెళ్లే మట్టి రోడ్లు ఇలా..

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా.. పేదలకు అందడం లేదు
- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పెద్దబజార్, ఆగస్టు 4: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, వైద్యం ప్రజలకు ఉచితంగా అందించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం నిజామాబాద్‌లో ఏఐటీయూసీ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన టీఎన్‌జీవోస్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లో ఈ రెండు ప్రభుత్వాలు కేటాయింపులు చేస్తున్నా పూర్తిస్థాయిలో పేదలకు అందడం లేదన్నారు. విద్య, వైద్యానికి తగినన్ని నిధులను కేటాయించడం లేదన్నారు. ప్రజలందరికి ఉచిత కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్నారు. పేదలు ఎంతవరకు చదివితే అంత వరకు ఉచితంగానే చదివించాలని ఆయన అన్నారు. లెక్కలు వేసి చూడటమే తప్ప కిందిస్థాయిలో ఎంతవరకు నిధులు వెళ్తున్నాయో పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర ప్రభుత్వం ద్వారా బడా పారిశ్రామిక వేత్తలకు 30లక్షల కోట్ల రూపాయల బకాయిలు మాఫీ చేశారని అన్నారు. పేదల కోసం మాత్రం ఎలాంటి మాఫీలను చేపట్టడం లేదన్నారు. రాష్ట్ర శాసనసభతో పాటు కేంద్రంలోని పార్లమెంట్‌లో పేదల పక్షాన మాట్లాడే నేతలే ఖరువయ్యారని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు సహనం కోల్పోతూ బూతులు తిట్టుకుంటున్నారని ఆయన విమర్శించారు. ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపించేది ప్రజాసమస్యలపై గళం ఎత్తడానికేనని ఆయన అన్నారు. అసంఘటిత రంగాల కార్మికులను దోపిడి చేసేందుకు ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు పేరు మీద నియామకాలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులు రెండు కోట్లకు పైగా ఉన్నారని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు తీసుకువచ్చామని చెప్పిన ఎంపీ అర్వింద్ ఆ ఊసే ప్రస్తుతం ఎత్తడం లేదని ఆయన ఆరోపించారు. ఇంతకి పసుపు బోర్డు తీసుకువస్తారా లేదా అని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి వి.సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, సీపీఐ కార్యవర్గ సభ్యులు, నాయకులు సాయిలు, విఠల్‌గౌడ్, చక్రపాణితో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

అమెరికాలో

సీఎంను కలిసిన మోర్తాడ్ వాసి



మోర్తాడ్, ఆగస్టు 4: ఉమ్మడి తెలంగాణ ఆంధ్ర, తెలుగు, ఉత్తర అమెరికా అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు చింత ఉషారాణి అమెరికాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఉషారాణి మోర్తాడ్‌కు చెందిన రిటైర్డు మండల విద్యాధికారి నందగిరి సత్యనారాయణ కూతురు. ఆమె కొన్నేళ్ల క్రితం అమెరికాలో స్థిరపడి అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలుగా కొనసాగుతున్నారు. గత ఏడాది కూడా జిల్లాలో కొన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, రాష్ట్రానికి భారీ పెట్టుబడులే లక్ష్యంగా.. సీఎం రేవంత్ రెడ్డి పది రోజుల పాటు అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఉషారాణి అమెరికాలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

రాళ్లవాగు వద్ద

పర్యాటకుల సందడి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 4: మండలంలోని కోనాపూర్ రాళ్లవాగు ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరిగింది. ప్రాజెక్టు అందాలను తిలకించడానికి భారీగా తరలివచ్చారు. ఆదివారం వీకెండ్ కావడంతో పకృతి ప్రేమికులు వరుసకట్టి జలాశయం వద్దకు చేరుకున్నారు. జాలువారుతున్న జలాలతో జలకాలాడారు. ప్రాజెక్టు మత్తడి పైనుంచి పడుతున్న నీటిముందు సెల్ఫీలకు పోటీపడ్డారు. ప్రాజెక్టు అందాలను సెల్ ఫోన్‌లో బంధిస్తూ సందడి చేశారు. ప్రతీరోజు వందల సంఖ్యలో సందర్శకులు కుటుంబసభ్యులతో వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. అక్కడే వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేస్తున్నారు. కాగా, రాళ్లవాగు వద్ద సందర్శకుల తాకిడి ఉన్నప్పటికీ అధికారులు ఎలాంటి సౌకర్యాలను కల్పించడం లేదు. ఈ సారైన స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు సందర్శకుల సౌకర్యార్థం కనీస వసతులు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.


• అలుగు కింద పర్యాటకుల జలకాలు

● ఆర్మూర్ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న సోయా పంట



తగ్గిన సోయాబీన్ సాగు విస్తీర్ణం

● మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపిన రైతులు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 4: ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సోయాబీన్ పంట సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గత సంవత్సరంతో పోల్చితే సాగు విస్తీర్ణం 50శాతానికి పరిమితమైంది. సోయాబీన్ పంటకు గత సంవత్సరం వైరస్ సోకడం, పల్లకు తెగులు, కాండం తొలుచుపురుగు తెగులు (ఎల్లోముజాయిక్)సోకి చీడ పీడల బెడద ఎక్కువై దిగుబడి తగ్గింది. దీంతో రైతులు పంట దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయారు. దీనికి తోడు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంట దిగుబడి కూడా తగ్గడం ఒక కారణంగా భావించవచ్చు.. సోయాబీన్ పంటను గత సంవత్సరం జిల్లాలో సుమారు 55వేల ఎకరాల్లో సాగు చేయగా ఈ సంవత్సరం 30వేల ఎకరాల్లో మాత్రమే సాగవుతుందని తెలుస్తోంది. ఆర్మూర్ మండల పరిధిలో గత సంవత్సరం సుమారు 4500ఎకరాల్లో సోయా పంట సాగు చేయగా ప్రస్తుతం కేవలం 1800ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. గత సంవత్సరం సోయాబీన్ పంట మిగిల్చిన నష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈయేడు రైతులు సోయాబీన్ పంట సాగుకు బదులు మొక్కజొన్న పంట సాగుపై దృష్టి సారించారు. మొక్కజొన్న పంటకు చీడపీడల బెడద తక్కువగా ఉండి గిట్టుబాటు అవుతుందన్న ఆలోచనతో రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గుచూపారు.

సోయా పంటకు బదులు మొక్కజొన్న పంటను రైతులు సాగు చేయడంతో మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ సంవత్సరం జిల్లాలో సుమారు 45వేల ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పంటలో కూడా అక్కడక్కడ కత్తెర పురుగు, ఎండు తెగులు సోకినప్పటికీ సకాలంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో తెగుళ్ల తీవ్రత అంతగా లేదు. మొక్కజొన్న పంటను ఆర్మూర్ మండలంలో గతంలో మూడు వేల ఎకరాల్లో సాగు చేయగా ఈ సంవత్సరం ఐదు వేల ఎకరాలకు పెరిగింది. మొక్కజొన్న పంటకు మంచి ధర లభిస్తుండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. గత ఏడాది కూడా మొక్కజొన్న పంటకు మంచి ధర పలికింది. ఈ సంవత్సరం క్వింటాలుకు రూ.2500పైనే ఉంటుందని రైతులు భావిస్తున్నారు. దీనికి తోడు కొందరు రైతులు మొక్కజొన్న పచ్చిబుట్టను సాగు చేయడంతో తక్కువ సమయంలోనే అధిక ఆధాయం పొందుతున్నారు. పచ్చిబుట్ట ఎకరానికి గరిష్ఠంగా రూ.లక్ష 10వేల పలకడం మొక్కజొన్నకు ఉన్న డిమాండ్‌ను తెలియజేస్తుంది. ఈ సారి సకాలంలో వర్షాలు కురువడంతో పచ్చిబుట్టకు మంచి ధర లభిస్తోంది. దీంతో పాటు ఎండు మొక్కజొన్నలను ఇథనాల్ తయారీలో వాడుతుండడంతో మొక్కజొన్నకు డిమాండ్ పెరిగి అధిక ధర వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

వర్ని,ఆగస్టు4: రాష్ట్రంలో మోసపూరిత వాగ్ధానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మి నారాయణ ఆరోపించారు. ఆదివారం చందూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ మాసంలో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపరిహారం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. రైతు కూలీలకు రైతు భరోసా రూ.12వేలు ఇస్తానన్న వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ పేరిట రెండు విడతల్లో జమ చేసిన డబ్బులు కేవలం 25శాతం మంది రైతులకు లబ్ధి చేకూర్చి మిగతా రైతులకు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ఫలితంగా అన్నదాతలు రుణమాఫీకి నోచుకోలేక ఎవరిని అడగాలో తెలియక బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కారుతోనే రైతులకు సమన్యాయం చేకూరుతుందని స్పష్టం చేశారు. రైతులతో పెట్టుకున్న వాళ్లకు రైతన్నలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కామారెడ్డి కన్వీనర్ శ్రీనివాస్, గణేష్ సింగ్, అరికెల సాయిరెడ్డి, నరెడ్ల నర్సింలు, సుమంత్, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ వర్ధంతికి పూర్తి మద్దతు: మోహన్‌నాయక్

జక్రాన్‌పల్లి, ఆగస్టు4: హైదరాబాద్‌లో ఈనెల 6న జరిగే ప్రజా ఉద్యమకారుడు, గాయకుడు గద్దర్ వర్ధంతిని లంబాడ హక్కుల పోరాట సమితి పూర్తి మద్దతు ఇస్తోందని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్ తెలిపారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈనెల 6న జరిగే గద్దర్ వర్ధంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు పా ల్గొన్నారు.

తొర్లికొండలో కొండపై పునుగు పిల్లి

జక్రాన్‌పల్లి, ఆగస్టు4: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం కొండపై పునుగు పిల్లి మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. వెంకటేశ్వరస్వామి కొండపై పునుగు పిల్లిలు ఉన్నాయని, పునుగు పిల్లి కళేబరం ఆదివారం కొండపై కనిపించినట్టు గ్రామస్థులు తెలిపారు. అనంతరం పునుగుపిల్లి కళేభరం కననం చేసినట్టు గ్రామస్థులు తెలిపారు.

తాగునీటి కోసం తంటాలు

● సారు మాకు దారేది, నీరేది
● భయం గుప్పిట్లో బతుకుతున్న కాలనీవాసులు
● నీటి కోసం వేళ్లాలంటే భయంగా ఉంది



నీటి కోసం బురదలో వెళ్లి తీసుకు రావలసిన దుస్థితి

రోడ్డును ధ్వంసం అయిన దృశ్యం

మోస్రా, ఆగస్టు4: మండల కేంద్రంలో గల పిట్ల గంగాధర్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ఇళ్ల వద్ద కాకుండా ఎక్కడో గ్రామ పంచాయతీ సంబంధిత నీరు పట్టుకునేందుకు నీటి నల్లాను దూరంగా బిగించారని నీరు పట్టుకునేందుకు వెళ్లాంటే దారిలేదు. చెట్ల పొదలతో అడవిలా ఉందని ఇప్పటి వరకు తేలుకాటుకు గురై బాధలు అనుభవించిన వారు ఇప్పటికి చాలామంది ఉన్నారు. ఈ ప్రాంతం అడవిని పోలిఉండగా పాములు తిరుగుతున్నాయి. కావున ఈ కాలనీలోని పిచ్చి మొక్కలు తొలగించాలి. ఈ కాలానికి ఒక్క దారి కూడా సరిగ్గా లేదని మొత్తం ముళ్ల చెట్లతో అడవిని తలపిస్తుందని బురదమయంగా ఉందని కాలనీలో చిన్న వర్షం పడిన బురదలో జీవనం కొనసాగిస్తునని ఈ కాలనీలో పిల్లలు, ముసలి వాళ్లు ఉన్నారని గ్రామ పంచాయతీ అధికారులు కనీసం మా వైపు చూడలేకపోతున్నారిన మాజీ స్పీకర్ ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఒక ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు అందరు అధికారులు వచ్చిన మా గోడు వినలేకపోయారు. గత ఎన్నో సంవత్సరాల నుండి రోడ్డు వేయమని అడిగితే ఇక్కడ ప్రాథమిక పాఠశాల ఉన్నదని పాఠశాల వరకు మాత్రమే సిమెంట్ రోడ్డు వేసిన రోడ్డుకు ఇరు వైపులా మట్టి వేయకు ఉన్న రోడ్డు పగిలిపోయిందని అడవిలాంటి కాలనీలో జీవినం కొనసాగుతున్న మా బతుకులకు దారి చూపాలని సంబంధిత అధికారులు మాగోడును పట్టించుకోని ఈ సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

● మిషన్ భగీరథ ఏఈఈ సాత్విక

జూలై నెలలో జరిగిన సర్వేలో వారికి మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇవ్వలేదు అన్నారు. గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకుంటే ఇస్తాము.

కాలనీ మొత్తం బురదమయంగా ఉంది



మా కాలనీలో మొత్తం బురదగా ఉంటది. ముళ్ల చెట్లు పిచ్చి మొక్కలతో అడవిలాగా ఉన్నది. ఇప్పటికి చాలా మందికి తేళ్ల కరిచి బాధలు పడ్డాము. పాములు తిరుగుతున్నాయి. భయం గుప్పిట్లో బతుకుతున్నాం.

\- లక్ష్మి, కాలనీ వాసి, మోస్రా

త్వరలో రోడ్డుపై మొరం వేయిస్తాం



ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది కాబట్టి కాలనీ సమస్యలను ఉన్నతాధికారులకు చేరవేస్తాను వారి ఆదే శాలు రాగానే పని మెదలు పెడతాం , అంతే కాదు ఆ కాలనీలో ఉన్న పిచ్చి మొక్కలు కచ్చితంగా తొలగిస్తాము. రోడ్డుకు మొరం మట్టి వేయిస్తాము.

-ప్రేమ్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, మోస్రా

రాజ్యాంగ విరుద్ధంగా వర్గీకరణ తీర్పు

● మద్దతు తెలిపితే గ్రామాలలో తిరుగనివ్వం



అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

బోధన్‌రూరల్,ఆగస్టు4: రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లు తీర్పు ఇచ్చారని, దేశంలోని 35కోట్ల మంది ఎస్సీలను ఒక తాటిపైకి తీసుకువచ్చే అవకాశాలను పక్కన పెట్టి తీర్పు ఇచ్చారని మాల మహానాడు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తడి మోహన్ రావు మాట్లాడుతూ బీజేపీ, టీడీపీలు రాజకీయ స్వార్థంతో ప్రవర్తిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తీర్పుపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ తీర్పుపై పలు రాష్ట్రాలు నిరసన వ్యక్తం చేస్తుంటే రేవంత్‌రెడ్డి అనుకూలంగా మాట్లాడడం సరికాదన్నారు. తీర్పుపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు న్యాయవాది ఈశ్వర్ మాట్లాడుతూ బీజేపీ రాజకీయ కుట్రలతో వర్గీకరణ తీర్పు వచ్చేలా చేశారని, వర్గీకరణకు మద్దతు ఇచ్చే ఎమ్మెల్యేలను గ్రామాలలో తిరుగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఆనంపల్లి ఎల్లమయ్య, నీరడి రవి, శ్రావణ్ కుమార్, కారం స్వామి, జిల్లా ప్రతినిధులు ఆనంపల్లి ఎల్లమయ్య, సూర్యకాంత్, పల్నాటి యాదగిరి, డిస్కో సాయిలు, కోటగిరి మండల అధ్యక్షులు మిర్జాపురం సాయన్న, లక్ష్మణ్, సంజీవ్, కొప్పర్గ సాయిలు, రాహుల్, విఠల్, బోధన్ డివిజన్ కమిటీతో పాటు వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నమల్లారెడ్డిలో ఉద్రిక్తత

● మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్థుల ఆందోళన
● డీఎస్పీ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు



చిన్నమల్లారెడ్డిలో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్న దృశ్యం, పోలీసుల బందోబస్తు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 4: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసు కున్నాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... వారసత్వంగా వస్తున్న భూమి విషయంలో నెలకొన్న తగదాతో శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన ఏదుల్ల రవీందర్ అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం రవీందర్ చనిపో వడానికి అతని పెద్దనాన్న సత్యనారాయణరెడ్డి, పెద్దమ్మ అనసూయ కారణమని ఆరోపిస్తూ వారి ఇంటివద్ద పెద్ద ఎత్తున కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టారు.దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. రవీందర్ చనిపోవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే గ్రామంలో అంత్యక్రియలు అయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు చోటుచేసు కోకుండా డీఎస్పీనాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఆదివారం భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.భూతగదాల విషయంలోనే రవీందర్ ఆత్మహత్య చేసుకున్నందున మృతుని భార్యకూతురికి తగిన న్యాయం చేసిన తర్వాతనే అంత్యక్రియలు చేయాలనికుటుంబ సభ్యులు,బంధువులు,గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. దీంతో ఒక్కసారిగా గ్రా మంలో ఉద్రిక్తత నెలకొంది.పరిస్థితిని అదు పు చేయాడానికి పోలీసుల బందోబస్తు చేశారు.

అబ్బాపూర్‌లో ఘనంగా తీజ్ పండుగ



అబ్బాపూర్(బి)తండాలో తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట,ఆగస్టు4: మండలంలోని అబ్బాపూర్(బి)తండాలో ఆదివారం సాయ oత్రం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు.గిరిజన బాలికలు, యువతులు 9రోజుల పాటు నిష్టతో గోదుమ మొలకలను పెంచి వాటిని బుట్టలో ఉంచి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన యువతులు, మహిళలు తమ సంప్రదాయ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.ఆషాడ మాసం చివరి అమావాస్య కావడంతో స్థానిక జగదాంబ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈకార్యక్రమంలో శోభన్, కైలాస్ నాయక్, పీర్ సింగ్, రవి, రాజేష్, మోతిలాల్, సేవాల్‌జీ పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుడికి సన్మానం

వేల్పూర్, ఆగస్టు4: వేల్పూర్ మండల కేంద్రంలో పూర్వ సీనియర్ కబడ్డీ క్రీడాకారుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ కబడ్డీ క్రీడాకారులు అందరు ఒక్కచోట చేరి ఒకరినొకరు పలకరించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వకబడ్డీ జాతీయ క్రీడాకారుడు ఏలేటి కిషన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ పూర్వవిద్యార్థులు గంగాధర్, రాజ్‌కుమార్, రాజేందర్, సందీప్‌లతో కబడ్డీ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థినులు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు4: ఆర్మూర్‌పణంలోని శ్రీబాషిత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక య్యారు.పాఠశాల కరస్పాండెంట్‌సుందర్ తెలిపారు. శనివారం నిజామాబాద్‌లోని నాగారం స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో శ్రీబాషిత విద్యార్థినిలు లాస్య ప్రియ,వంద మీటర్ల పరుగుపందెంలో, ఎస్.లావణ్య, జావెలిన్‌త్రో పోటీలలో అత్యుత్తమప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ముస్తాబైన ఏకచక్రేశ్వరాలయం



అలంకరించిన ఏకచక్రేశ్వర ఆలయ ప్రాంగణం

బోధన్‌రూరల్,ఆగస్టు4: బోధన్ పట్టణంలో ప్రసిద్ధి చెందిన ఏకచక్రేశ్వరాలయం శ్రావణ మాసం సోమవారం నుంచి ప్రారంభం కావడం శుభ సూచికం అని ఆలయ వేద పండితులు గణేష్ మహరాజ్ అన్నారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దామన్నారు. నెల రోజుల పాటు ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. మహ శివునికి శ్రావణ మాసం చాలా ప్రీతికరమైనదని ఈ మాసంలో భక్తులు నిష్ఠగా ఉంటూ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కోరిక కోర్కెలు తప్పకుండా నెరవేరుతాయని ఆయన పేర్కొన్నారు. శ్రావణ మాసంలో దేవాలయంలో ప్రతి ఒక్కరు సంప్రదాయ దుస్తులు ధరించాలన్నారు. ఆలయంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. శ్రావణ మాసంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సరిత

పెద్దబజార్, ఆగస్టు 4: నగరంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని పీవోడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ పిట్ల సరిత అన్నారు. ఆదివారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మద్యానికి వ్యతిరేకంగా, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా స్త్రీ, పురుష సమానత్వం కోసం స్వయం నిర్ణయాధికార స్వేచ్ఛ కోసం పోరాడాలని అన్నారు.

● పీవోడబ్ల్యు నగర నూతన కార్యవర్గం

నగర అధ్యక్షురాలు నీలం లక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఆకుల సబిత, ప్రధాన కార్యదర్శి గొంట్యాల సంజన, సహాయ కార్యదర్శి శాంతక్క, కోశాధికారి మానస, కార్యవర్గ సభ్యులు ఉమారాణి, రాజ్యలక్ష్మి, తంకడి రేఖ, సురేఖ, అనంతక్క, మాధవి, గంగ, పావని, లక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర సైక్లింగ్ సంఘ ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కాంత్



విజయ్‌కాంత్‌ను అభినందిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, ఆగస్టు 4:తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శిగా భూలోకం విజయ్‌కాంత్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర సైక్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శిగా భూలోకం విజయ్‌కాంత్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్‌కాంత్‌రావు మాట్లాడుతూ సైక్లింగ్ క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. సెప్టెంబర్ 24 నుంచి జరుగనున్న ఖేలో ఇండియా సౌత్‌జోన్ మహిళల సైక్లింగ్ పోటీలు జిల్లాలో జరుగుతున్నాయని అన్నారు. దక్షిణ భారతదేశంలోని మహిళలు, బాలికలు ఈ పోటీలో పాల్గొంటారని అన్నారు. ఈ పోటీలకు సంబంధించి కార్యవర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైక్లింగ్ జిల్లా అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ సుబేదార్, నర్సింగ్‌రావు, రాకేష్‌కుమార్, నరేష్‌కుమార్, దుర్గామల్లేష్, శరత్‌కుమార్, శ్రీధర్‌రావు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈ ఉద్యోగం సాధించిన నాగేపూర్ యువకుడు



నవదీప్ గౌడ్

నవీపేట,ఆగస్టు4: మండలంలోని నాగేపూర్‌కు చెందిన ఏ.నవదీప్ గౌడ్ పంచాయతీరాజ్ విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) ఉద్యోగం సాధించాడు. గీత కార్మిక కుటుంబానికి చెందిన నవదీప్ గౌడ్ చిన్నప్పటి నుండి విద్యాభ్యాసంలో ముందుండే వాడు. రెండు సంవత్సరాల క్రితం ఎంటెక్ పూర్తి చేసిన ఆయన హైదరాబాద్ టీసీఎస్‌లో ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగానికి ప్రిపరేషన్ అయ్యాడు. 2022లో జరిగిన ఉద్యోగ అర్హత పరీక్షకు హజరు కాగా శుక్రవారం విడుదలైన ఫలితాలలో నవదీప్ గౌడ్ ఏఈఈగా ఉద్యోగం సాధించాడు. 193ర్యాంకు సాధించి ఓపెన్ కేటగిరిలో ఉద్యోగం పొందాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల తల్లిదండ్రులు జ్యోతి, లక్ష్మినారాయణ గౌడ్‌లతో పాటు గ్రామస్థులు అభినందించారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం



వేల్పూర్‌లో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

వేల్పూర్, ఆగస్టు4: ఎస్సీవర్గీకరణపై అత్యున్నత సుప్రీం కోర్టు ఇచ్చి తీర్పు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం వేల్పూర్ మండల కేంద్రంలోని బాబుజగ్జీవన్ రావు, అంబేద్కర్ విగ్రహానికి మాదిగ దండోర సభ్యులు నివాళులు అర్పించారు. అనంతరం మండల కేంద్రంలో అంబేద్కర్‌చౌరస్తా వరకు మాదిగ దండోర సభ్యులు, మహిళలు పెద్దఎత్తున ర్యాలీగా వెళ్లి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం తుది తీర్పు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీరిజర్వేషన్‌లు అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ దండోర సభ్యులు, మహిళలు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టీసీసీ థియరీ పరీక్ష

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 4:టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ థియరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. లోయర్ గ్రేడ్ టైలరింగ్, డ్రాయింగ్, మ్యూజిక్‌కు సంబంధించిన పరీక్షలు మానిక్‌భవన్, ఆదర్శ హిందీ పాఠశాలలో వివిధ సెషన్స్‌లలో నిర్వహించారు. సైకాలజీ, స్కూల్ అడ్మినిస్ట్రేషన్ పరీక్ష, మెథడ్స్ ఆఫ్ టీచింగ్, మెథడ్స్ ఆఫ్ టీచింగ్ స్పెషల్ పరీక్షలకు మొత్తం 435 మందికి గాను 433 మంది హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారు.

నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు

- డీఈవో దుర్గాప్రసాద్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొత్తపల్లిలో మధ్యాహ్న భోజనంపై విచారణ జరుపుతున్న డీఈవో

కోటగిరి,ఆగస్టు4: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని లేనిపక్షంలో తగిన చర్యలు తప్పవని డీఈవో దుర్గాప్రసాద్ హెచ్చరించారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కారంపొడితో విద్యార్థులకు భోజనం అనే శీర్షికకు డీఈవో స్పందించారు. కొత్తపల్లి పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడారు. విద్యార్థులకు అలాంటి భోజనం ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. ఏజెన్సీ నిర్వాహకులు తమ తప్పును అంగీకరించారు. రెండు రోజుల్లో తీరు మార్చుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మరోమారు ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే తగిన చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ గంగాధర్, ఎంఈవో నాగనాథ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలే ప్రభుత్వాలను కదిలిస్తాయి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

పెద్దబజార్, ఆగస్టు 4: ప్రజాసమస్యలతో పోరాటాలే ప్రభుత్వాలను కదిలిస్తాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు అన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో నగర పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైవారు మాట్లాడుతూ పెట్టుబడిదారి అనుకూల విధానాల మూలంగా పేదరికం మరింత పెరిగిందని అన్నారు. డొక్కాడని పేదల సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు.పేదలకు అవసరమైన కూడు, గూడు, గుడ్డ కల్పించడంలో సరైనా విధానాలు అనుసరించకపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయి పేదరికం పెరిగిందని ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతాయని అన్నారు. ప్రజల దృష్టిని మార్చడానికి ప్రజల్లో వైశాల్యాలను పెంచి రాజకీయ లబ్ధిపొందాలని అన్నారు. మతతత్వ విధానాలను అధికారాన్ని నిలబెట్టుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేరళలో వచ్చిన వరద కారణంగా వేలాది కుటుంబాలు నిరాశ్రులయ్యారని,వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని,అనేక మంది జాడ ఇంకా లభించలేదని వారిని ఆదుకోవడానికి మానవతావాదులు ప్రజ లు సహకరించాలని కోరారు.ఈకార్యక్రమంలో పార్టీ జిల్లానాయకులు సుజా త, నగర నాయకులు రాములు, అనసూయ, లక్ష్మి,గోవర్ధన్, శంకర్,పాల్గొన్నారు.

హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యానంద్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 4:గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 5571 ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యానంద్, రమేష్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నగరంలోని మల్లుస్వరాజ్యం ట్రస్టు కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీసు నిబంధనల జివో 11, 12లను సవరించి డిగ్రీ, బీఈడి అర్హతలతో నియామకమైన ఎస్‌జీటీలకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. బదిలీ అయిన ఎస్‌జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని, సర్వీస్ నిబంధనల సవరణకు ముందు ఏర్పడిన స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఫిజికల్ డైరెక్టర్ ఖాళీలను కామన్ సీనియారిటీ ప్రకారం ఎస్‌జీటీలకు పదోన్నతి కల్పించాలని అన్నారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో నాయకులు సిరాజుద్దీన్, మల్లేష్, గంగాదాస్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

బీర్కూర్, ఆగస్టు 4 : మండల కేంద్రంలో ముగ్గురు యువకులు ఆరుగురిపై దాడి చేశారు. ఈ ఘటనలో గణేష్, బన్ను అనే వ్యక్తులు తీవ్రం గా గాయపడ్డారు. ఈ మేరకు గాయపడిన ఆరుగురు బీర్కూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ముగ్గురు యువకులపై ఫిర్యాదు చేశారు. బాధితులు తెలి పిన వివరాల ప్రకారం... బీర్కూర్ మండల కేంద్రంలో పుల్లారావు హోట ల్‌లో పనిచేసే బన్నీ అనే యువకుడు బైక్‌పై వెళుతున్నాడు. సతీష్ అనే యువకుడు వేగంగా ఎందుకు నడుపుతున్నావంటూ అసభ్యపదజాలం తో దూషించాడు. దీంతో బన్నీ తనను ఎందుకు దూషించావని ప్రశ్నించా డు. ఇద్దరి మధ్య గొడవ పెరిగి కొట్టుకున్నారు. దీంతో పక్కనే ఉన్న సతీ ష్ స్నేహితులు అనిల్, నవీన్‌లు ముగ్గురు కలిసి బన్నీని చితక్కొట్టారు. అడ్డుకునేందుకు వచ్చిన మరో ఐదుగురిపై దాడి చేశారు. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడినవారు సతీష్, అనిల్‌లపై బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేసిన షబ్బీర్ అలీ

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 4: గత అసెంబ్లీ ఎన్నికల్లో నగర అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా నగరంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. ఆదివారం ఈ మేరకు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పలు డివిజన్‌లకు చెందిన ప్రజలకు, వివిధ సంఘాల ప్రతినిధులకు సీసీ రోడ్లు, డ్రైనేజీ, పలు కమ్యూనిటీ హాళ్లకు కంపౌండ్ వాల్ అభివృద్ధికి 10వేల కోట్లను కేటాయించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి రూ.10కోట్లు నగర అభివృద్ధికి తీసుకురావడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీల ప్రజలు, సంఘాల ప్రతినిధులు షబ్బీర్ అలీని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను, మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్‌కు రూ.500లు అందించడం జరిగిందని ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఐదు ఇప్పటికే అమలు చేశామన్నారు. త్వరలో పేదలకు ఇందిరమ్మ ఇండ్ల కింద స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. నిజామాబాద్ పట్టణాన్ని అమృత్ నిధుల ద్వారా 300 కోట్ల రూపాయలు తీసుకువచ్చి నీటిసమస్యతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను తీర్చి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడుగు గంగాధర్, రత్నాకర్, ఖుద్దూస్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

నగరంలో ఇటీవల అబం శుభం తెలియని బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు గంగాధర్‌ను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సీపీ కల్మేశ్వర్‌ను ఆదేశించారు. ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అత్యాచారానికి గురైన బాలిక తల్లిదండ్రులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారిని ఓదార్చి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎక్స్‌గ్రేషియాను త్వరలో అందేలా చూస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సీపీతో ఫోన్‌లో మాట్లాడి నింధితుడికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని



కాలనీవాసులతో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

అన్నారు. మహిళా శిశుసంక్షేమ అధికారినితో మాట్లాడి బాధితులకు వెంటనే సహాయం అందేలా చూడాలన్నారు. బార్ కౌన్సిల్‌లో మాట్లాడి నింధితుడు తరపున ఎవరూ వాదించవద్దని కోరారు. బాలికకు ఆసుపత్రిలో అయ్యే వైద్య ఖర్చు మొత్తం తానే భరిస్తానని ఆయన తెలిపారు.

● ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం

నగరంలోని షాహిన్ అకాడమిలో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సన్మానించారు. నగరంలోని లిమ్రా గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ స్థాయిలో నీట్ ర్యాంకులు సాధించడంతో పాటు పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మైనార్టీ కమీషన్ చైర్మన్ తారిక్ అన్సారి, మేయర్ నీతూకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వల్ల మోసపోతున్న ప్రజలు

- వాట్సాఫ్ కాల్స్‌తో సీబీఐ పోలీసులమంటు బెదిరింపులు
- డబ్బులు పోగొట్టుకుంటున్న బాధితులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు4: ఇటీవల సైబర్ క్రైంలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సైబర్ నేరాగాళ్లు వాట్సాఫ్‌లో పోలీస్ డ్రెస్సులో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ఫోటో పెట్టి పలువురికి సీబీఐ పోలీసుమంటు తమ కుమారుడు, కూతురుపై కేసు నమోదు అయ్యిందని, డబ్బులు పంపితే తక్షణమే వదిలేస్తామంటూ నమ్మబలుకుతున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో పలువురు డబ్బులను పంపి బయట చెప్పుకోకుండా ఉంటున్నారు. ఒక్కసారి డబ్బులు పంపితే మళ్ళీ వారికి ఇంక ఎక్కువ మొత్తంలో డబ్బులు పంపాలని ఒత్తిడి చేసిన సంఘటనలు లేక పోలేదు. ఇటీవల ఆర్మూర్ మండలం రాంపూర్ గ్రామంలో అంజలి అనే మహిళకు తమ నాన్న బెహరన్ దేశంలో పట్టుబడ్డాడని డబ్బులు డిమాండ్ చేశారు. అలాగే అంకాపూర్ గ్రామంలో ఓవ్యక్తికి ఫోన్ చేసి తమ కుమారుడిని పట్టుకున్నామని, రూ.30వేలు డిమాండ్ చేయగా రూ.20వేలు ఫోన్ పే ద్వారా పంపినట్టు తెలిసింది. ఇంకా రూ.10వేలు పంపాలని డిమాండ్ చేయ డంతో సైబర్ క్రైంకు ఫిర్యాదు చేయాలని పలువురు తెలపడంతో ఊరట పొం దారు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతీ గ్రామంలో ప్రతీవార్డులో ఏదో ఒకరు సైబర్ క్రైం ఉచ్చులోపడుతున్నారన్నారు. అదీయేగాక మహిళ నగ్నంగా ఉంటూ వీడియో కాల్ ద్వారా ఫోన్ చేసి దానిని రికార్డు చేసి బాధితుడికి పంపి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులను గుంజేవారు. ఎప్పుడు ఏలాంటి ఫోన్ వస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

● ప్రతీ గ్రామంలో సైబర్‌క్రైంల గురించి అవగాహన అవసరం

ప్రతీ గ్రామంలో సైబర్ క్రైంల గురించి అవగాహన ఎంతైన అవసరం ఉంది. గత కొద్ది నెలలుగా ప్రతీచోట సైబర్ క్రైంతో తాను సంపాదించుకున్న డబ్బులు పొగొట్టుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఇందుకు గాను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రతీ గ్రామంలో సైబర్ క్రైంల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన పరిస్థితి ప్రభుత్వంపై ఉంది. తాము చెమటోడ్చి సంపాదించిన డబ్బును తమ కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకున్న సైబర్‌క్రైం నేరాగాళ్లు ఎప్పుడు ఏలాంటి సంఘటనలు తెలుపుతారో, ఏలా దోచుకుంటారో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రతీ రోజు ఎవరికో ఒకరికి సైబర్‌క్రైం నేరాగాళ్లు ఫోన్‌లు చేస్తునే ఉన్నారు వీరి నుంచి తప్పించుకోవాలంటే ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

వసతి గృహ సమస్యలను పరిష్కరించాలని వినతి



షబ్బీర్‌అలీకి వినతి పత్రం అందజేస్తున్న సుభాష్‌జాదవ్

నిజామాబాద్ అర్బన్,ఆగస్టు 4:నగరంలోని గిరిరాజ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ గిరిజన మహిళ వసతి గృహసమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగర ఎస్టీసెల్ అధ్యక్షుడు సుభాష్‌జాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేశారు.నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆయనను కలిసి భవనం శిథిలావస్థలో ఉందని డ్రైనేజీ, మినరల్‌వాటర్‌ప్లాంట్ పూర్తిగా పాడైయ్యాయని,కరెంటు సరఫరా సరి గా లేదని కోరారు. అదేవిధంగా హాస్ట ల్ చుట్టు పక్కల పిచ్చిమొక్కలు పెరిగి పాములు వస్తున్నాయని వెంటనే వసతిగృహం మరమ్మతులు చేయించాలని కోరారు. ఫ్యాన్‌లు,ఇతరవసతులు కల్పించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.త్వరలో తాను వసతి గృహాన్ని సందర్శిస్తాననిఆయన హామీ ఇచ్చారు.

జిల్లాలో కొత్త సబ్ రిజిస్ట్రార్‌ల పోస్టుల భర్తీ

ఖిల్లా, ఆగస్టు 4: జిల్లాలోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆశాఖాధికారులు కొత్త సబ్‌రిజిస్ట్రార్‌లను నియమించింది. గతంలో సీనియర్ అసిస్టెంట్‌లతో కొనసాగించిన ఆశాఖ ఎట్టకేలకు పూర్తిస్థాయి సబ్‌రిజిస్ట్రార్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరందరు ఆయా ప్రాంతాల్లోని కార్యాలయాల్లో విధుల్లో చేరారు. గతంలో అవినీతి ఆరోపణలు మూటకట్టుకున్న ఆ శాఖలో ప్రక్షాళన చేస్తూ ఆశాఖలో పూర్తి స్థాయి అధికారులను నియమించింది. నిజామాబాద్ అర్బన్‌కు నిర్మల్ నుంచి గ్రేట్-1అధికారిగా ఉన్న కిరణ్‌తేజావత్‌ను, మరో అధికారిను ఆదిలాబాద్ నుంచి బదిలీపై శ్రీరామరాజు గ్రేట్-2సబ్‌రిజిస్ట్రార్‌లుగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న రాంచంద్రయ్యను ఖమ్మం జిల్లా వైరా సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. ఇక్కడే రెండవ సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన బదర్‌ను నిజామాబాద్ డీఐజీ కార్యాలయంలోని ఎంవి.ఆడిట్ విభాగానికి బదిలీ చేశారు. రూరల్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఇప్పటి వరకు కొనసాగిన సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌ను కోరుట్లకు బదిలీ చేయగా ఆయన స్థానంలో ఆదిలాబాద్ నుంచి ఎస్.రాజశేఖర్‌రెడ్డి పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. బోధన్‌లో సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన రవికిరణ్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా బోథ్ నుంచి సాయినాథ్ సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. భీంగల్‌లో సబ్‌రిజిస్ట్రార్‌గా కొనసాగిన సీనియర్ అసిస్టెంట్ వాసును ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు.ఆయన స్థానంలో మల్యాల్ నుంచి ఎండి.ఎక్బాల్‌ను బదిలీ చేశారు. ఆర్మూర్‌లో పని చేస్తున్న ఆసీఫ్‌ను మెట్‌పల్లికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో భైంసా నుంచి డి.మహేందర్‌రెడ్డిని బదిలీ చేశారు.

పోచంపాడ్‌లో ఘనంగా బోనాల పండుగ



పోచంపాడ్‌లో బోనాల ఊరేగింపులో పోతరాజు విన్యాసాలు

మెండోర, ఆగస్టు4: మండలంలో పోచంపాడ్ గ్రామంలో బోనాల పండగను గ్రామప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివసత్తుల పునకాలు పోతరాజు విన్యాసాలు, మహిళలు మంగళహారతులతో మహిళలు బోనాలు ఎత్తుకొని గ్రామంలో ఉన్న గ్రామ దేవతల ఆలయా వరకు గ్రామవీదులగుండా ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించి గ్రామప్రజలకు మొక్కులు చెల్లించుకున్నారు.ఈకార్యక్రమంలో గ్రామప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

మానవత సదన్ చిన్నారులకు పుస్తకాల పంపిణీ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి,ఆగస్టు 4: టీజీఎస్‌పీడీసీఎల్ సూపరింటెంట్ ఇంజనీర్ రవీందర్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం డిచ్‌పల్లిమానవత సదన్ చిన్నారులకు విద్యుత్ శాఖ అధి కారులు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులకు అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. మంచిగా చదువుకొని భవిష్యత్తులో పెద్ద సాయిలో స్థిరపడాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజ నం చేశారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి ఏఈ సాయిలు, సిబ్బంది ఉన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధనకు ఆత్మ విశ్వాసంతో పోరాడాలి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 4: వంజరిలకు ఎస్టీ రిజర్వేషన్ సాధన లక్ష్యంలో ఆత్మ విశ్వాసమే ఆలంభనగా అడుగులు వేయాలని నిరాశ నిస్పృహలు వీడనాడి విజయం కొరకు ముందుకు సాగి పోరాడాలి,తమ ముందున్న లక్ష్యమని నిజామాబాద్ జిల్లా వంజరి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కరిపె సత్యం తెలిపారు. ఎస్టీ రిజర్వేషన్ల సాధన అత్యంత కీలకమైనదని వంజరి జాతి భవిష్యత్తుకు బాటలు వేసే మార్గమని అందుకు కుల సభ్యులంతా ఐక్యంగా ముందుకు వెళ్లి పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం రక్తంతో సంతకాలు చేసిన స్ఫూర్తిని తీసుకొని వంజరిలకు ఎస్టీ రిజర్వేషన్ ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. కోల్పోయిన రిజర్వేషన్‌లను సాధించుకునేందుకు ప్రతీ ఒక్కరు కీలకపాత్రను పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ప్రతి జిల్లాలో సమావేశాలు ఏర్పాటు చేసి రిజర్వేషన్ సాధన కోసం ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్లాలని ఆయన కోరారు.

'మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి'

డిచ్‌పల్లి,ఆగస్టు 4: టీయూ భిక్కనూర్ సౌత్ క్యాంపస్‌కి చెందిన ప్రీతమ్ అనే విద్యార్థి భిక్కనుర్ ప్రధాన ప్రధాన రోడ్డుపై శనివారం ఆటో ఢీకొని మృతి చెందడం బాధాకరమని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలని టీయూగిరిజనశక్తి విద్యార్థి సంఘం నాయకుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదాలు జరిగే భిక్కనూర్ ప్రధాన రోడ్డుపై వంతెన నిర్మించాలని కోరారు.

డాక్టర్ కాసర్ల నరేష్‌రావుకు 'సీనారె పురస్కారం'



కాసర్ల నరేష్‌రావు

నిజామాబాద్ రూరల్, ఆగస్టు, 4: జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, తెలుగుభాషోపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు ప్రముఖ సినీకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి పేరిట రాష్ట్రస్థాయిలో అందించే "సినారె పురస్కారం"-2024కు ఎంపికయినట్లు సినారే కళాపీఠం సంస్థ నిర్వాహకులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో తెలుగు సాహిత్యరంగంలో విశేష కృషి చేసిన వారిని ఎంపికచేసి ఈ పురస్కారం అందిస్తున్నారు. డాక్టర్ కాసర్ల నరేష్‌రావు గత మూడు దశాబ్దాలుగా జిల్లాలో సాహిత్య సేవలందిస్తున్నారు. 10 పుస్తకాలు ప్రచురించారు. బాల సాహిత్యం, పద్యం, గద్యం, కథలు, కవితలు, వక్తృత్వం వంటి వాటిలో విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నారు. ఇందూరు బాల సాహిత్య వేదిక ఏర్పాటుచేసి బాల సాహిత్యాన్ని ముందుండి నడిపిస్తు ప్రోత్సహిస్తున్నారు. డాక్టర్ కాసర్ల స్వస్థలం సిరికొండ మండలం గడ్కోల్ గ్రామం. ఈనెల 10న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో కాసర్ల నరేష్‌రావు ఈ పురస్కారం అందుకోనున్నారు. పురస్కారానికి ఎంపికైన కాసర్లను సాహితీమిత్రులు, టీచర్లు, సాహిత్యకారులు అభినందించారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



పోతరాజులతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

ధర్పల్లి,ఆగస్టు 4: మండల కేంద్రంలో ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతియేటా ఒకరోజు ముందు గ్రామదేవతలకు మొక్కులు, ముడుపులు చెల్లించుకుంటారు.నెల రోజుల అనంతరం ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకుంటారు.అంటువ్యాధులు విషజ్వరాలు ప్రబలకుం డా ఉండేందుకు గ్రామంలో గ్రామస్థులు సుఖశాంతులతో ఉండాలని పూజలు చేశారు. ఈ సందర్భంగా పోతరాజులు చేసిన విన్యాసాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ మహేందర్, బాలయ్య, ప్రభాకర్, అశోక్, బాబన్న, నిశాంత్, సంతోష్, ఎల్లయ్య, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన కస్తూర్బా విద్యార్థినులు



అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థినులు

సిరికొండ,ఆగస్టు 4: సిరికొండ మండల కేంద్రంలోగల కస్తూర్బా పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్న తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో ముగ్గురు విద్యార్థులు అత్యంత ప్రతిభకనబర్చినందున వారిని రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. జిల్లాలో జరిగిన అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో కస్తూర్బా విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎంపికైన విద్యార్థినులు సంధ్య, మౌనిక, సావిత్రిలు ఉన్నారు.

నషా ముక్తి భారత్ జిల్లా కమిటీ సభ్యుడిగా రామ్మోహన్‌రావు



రామ్మోహన్‌రావు

పెద్దబజార్, ఆగస్టు 4:డ్రగ్స్, గంజాయి, తదితర మా దకద్రవ్యాలను జిల్లాలో అరికట్టేందుకు, ప్రచారం చేసేందుకు జిల్లాస్థాయి కమిటీని ఆదివారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నషా ముక్తి భారత్ జిల్లా కమిటీ సభ్యునిగా రామ్మోహన్‌రావును నియమించారు. కలెక్టర్ చైర్మన్, సీపీ, మహిళా శిశు సంక్షేమ అధికారులు, వైద్య అధికారులు తదితరులతో పాటు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామ్మోహన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేద కమ్మ కుటుంబాలకు అండగా ఉంటాం

- మాధవనగర్‌లో సమావేశమైన కమ్మసంఘ సభ్యులు



సమావేశంలో పాల్గొన్న కమ్మ సంఘం ప్రతినిధులు

డిచ్‌పల్లి,ఆగస్టు 4: నిజామాబాద్ కమ్మ సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు అప్పనేని లక్ష్మీ అధ్యక్షతన ఆదివారం మాధవనగర్ కమ్మ సంఘ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. కమ్మ సంఘం తరుపున ఇప్పటి వరకు ఎంతో మంది పేద కుటుంబాలను ఆదుకున్నామని తమ సామాజిక వర్గంలోని పేద కుటుంబాలకు ఆదుకుంటామని తెలిపారు. సంఘం ఏర్పాడిన నుంచి నేటి వరకు అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా నూతన సలహా కమిటీని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నారాయణ, కమ్మ సంఘం ప్రతినిధులు అప్పరావు, గోపాలం విద్యాసాగర్ రావు, కార్పొరేటర్ ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73200	రూ.67,500	రూ.880

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (10.00, 4.45, 10.30)
: కల్కి (3డీ తెలుగు) (1.00)
: శివం భజే (7.45)
స్క్రీన్-2 : శివం భజే (10.50, 4.35, 10.20)
: బుడ్డి (1.35, 7.20)
స్క్రీన్-3 : అరోన్ (హిందీ) (10.20, 7.00, 10.10)
: విరాజి (1.30)
: అలనాటి రామచంద్రుడు (3.50)
స్క్రీన్-4 : లారీ ఛాప్టర్-1 (10.05)
: రాయన్ (1.50)
: తిరగబడరా సామి (5.00)
: ఉషా పరిణయం (7.35)
: ఆవరేజ్ స్టూడెంట్ నాని (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : బుడ్డి (తెలుగు) (1.35, 7.30)
: ఆరోన్ (హిందీ) (4.30, 10.20)
స్క్రీన్-2 : కల్కి (తెలుగు) (10.25, 1.30, 10.30)
: రాయన్ (4.50, 7.40)
స్క్రీన్-3 : రాయన్ (1.20, 10.45)
: కల్కి (4.10, 7.30)

దేవి : రాయన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: తిరగబడరా సామి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్